ఎన్నికల ముందు యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు రుణాలు, విద్యా భరోసా కార్డు వంటి హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో వైఫల్యాలు, హామీల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా నాలుగో రోజు హన్మకొండలో, పరకాల పట్టణంలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - అక్షరశక్తి, హన్మకొండ, పరకాల


# అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 302 | వరంగల్ | శనివారం, 05 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07





# కాంగ్రెస్‌ది దగా పాలన

## హామీలు అమలు చేయకుండా యువతను మోసం చేసింది


లోపలి పేజీల్లో..


- విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది
- వెంటనే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చల్లా
- 1000 రోజుల పాలనా వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట
- హన్మకొండ, పరకాలలో భారీ ర్యాలీలు
- విద్యార్థులను అడ్డుకున్న పోలీసుల తీరుపై చల్లా ఆగ్రహం







2


## కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుదారాణి

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుదారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో నిర్వహించిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో భాగం గా....ఛాంబర్ లో అధికారికంగా కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. - అక్షరశక్తి, హనుమకొండ

## కాంగ్రెస్‌లో 'అచ్చ.. పచ్చ' పంచాయితీ!

- కుడా మాజీ చైర్మన్ ఇనుగాలకు వీడ్కోలు లేకుండానే పదవీ మార్పు
- హడావుడిగా కొత్త చైర్‌పర్సన్ గుండు సుధారాణి ప్రమాణ స్వీకారం
- కార్యక్రమానికి మాజీ చైర్మన్ దూరం.. పార్టీ వర్గాల్లో మొదలైన కొత్త చర్చ
- కొత్తగా వచ్చిన నేతలకే ప్రాధాన్యమంటూ పాత కాంగ్రెస్ నేతల అసంతృప్తి


5






ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయ విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' పేరుతో కొంతకాలంగా సాగుతున్న రాజకీయ చర్చకు కుడా చైర్మన్ పదవిలో చోటుచేసుకున్న పరిణామాలు మరింత ఆజ్యం పోసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇనుగాల వెంకట్రాంరెడ్డి పదవీకాలం ముగిసిన వెంటనే గుండు సుధారాణిని కుడా చైర్‌పర్సన్‌గా నియమించడం, ఆ వెంటనే ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించడం చర్చకు దారితీసింది. మాజీ చైర్మన్‌కు వీడ్కోలు కార్యక్రమం లేకపోవడం, కొత్త చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారానికి వెంకట్రాంరెడ్డి హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. - అక్షరశక్తి, వరంగల్





## కుడా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుదారాణి

**అక్షరశక్తి, హనుమకొండ:** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా గుండు సుదారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో నిర్వహించిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో భాగం గా....ఛాంబర్ లో అధికారికంగా కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా వైస్ చైర్మన్/ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, తదితరుల సమక్షంలో కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి కి ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పుష్పగుచ్చాలు, పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కుడా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గుండు సుదారాణి మాట్లాడుతూ... తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కుడా పరిధిలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొని నూతనంగా కుడా చైర్‌పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి అభినందనలు తెలిపారు.

## ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



**అక్షరశక్తి,హన్మకొండ:** గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలను శనివారం హన్మకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకితభావంతో, సుదీర్ఘ అనుభవంతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఐటీ, ఒలింపియాడ్ గణిత బోధనలో విశేష సేవలందిస్తున్న కాసం సంతోష్‌కుమార్, SSQUARE మ్యాథ్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పిస్తున్నందుకు ప్రత్యేకంగా సన్మానించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఇండస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఏ. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ బోధనా వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా భావించి చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని గౌరవించడం తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని రాకేష్ రెడ్డి తెలిపారు.





## సాఫీగా గ్రామాలకు తాగునీటి సరఫరా

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్**

**అక్షరశక్తి, హనుమకొండ:** శాయంపేట మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రా వాటర్ ఎక్కడినుండి వస్తుందని, నీటి సరఫరా పరిస్థితి ఎలా ఉందని, పంపుల పనితీరు, క్లోరినేషన్, ఇన్‌ట్రా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, పంపింగ్ తీరు తదితర అంశాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శాయంపేట మండలంలోని 26 గ్రామాలకు రోజుకు ప్రస్తుతం సుమారు 5.35 ఎమ్ఎల్డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అన్ని పంపులు పని చేసే స్థితిలో ఉన్నాయా, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు వెంటనే వినియోగించేందుకు స్టాండ్‌బై పంపులు, ప్రత్యామ్నాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులు, అదనంగా పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అదే విధంగా పరకాల లోని చలి వాగుకు సంబంధించిన చెక్ డ్యామ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెక్ డ్యామ్ ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చేపట్టనున్న మరమ్మతు పనుల గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, వాటర్ గ్రిడ్ ఈఈ సురేందర్, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## టూరిస్ట్ గైడింగ్‌పై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ వారసత్వ సంపద, పర్యాటకం, టూరిస్ట్ గైడింగ్‌పై 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పర్యాటక అధికారి శివాజీ హాజరై మాట్లాడుతూ, సుమారు 30 ఏళ్ల తర్వాత డిగ్రీ కళాశాల స్థాయిలో టూరిస్ట్ గైడింగ్‌పై సర్టిఫికెట్ కోర్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. పర్యాటక రంగంలో గైడ్లకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, స్థానిక చరిత్ర, వారసత్వం, సంస్కృతి, పర్యాటక ప్రదేశాలను దేశ, విదేశాల నుంచి వచ్చే సందర్శకులకు వివరించేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, తెలంగాణ దర్శిని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ మాట్లాడుతూ చరిత్రతో పాటు పర్యాటక సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్ర అన్ని విషయాలకు మూలాధారమని, ఈ సర్టిఫికెట్ కోర్సు ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో పర్యాటక రంగంలో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ కోర్సు ప్రాధాన్యతను వివరించగా, చరిత్రకారుడు, టార్చ్ ప్రతినిధి అరవింద్ ఆర్య తెలంగాణ గైడింగ్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి**

**అక్షరశక్తి, హనుమకొండ:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి ఆరోపించారు. సెప్టెంబరు 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెగడపల్లి డబ్బాల జంక్షన్ వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోట బిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానానికి బదులుగా యాజమాన్యాలు తమకు నచ్చిన విధంగా పని గంటలను నిర్ణయించుకునే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను




నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మికులను ఇబ్బందులకు గురిచేసే చర్యగా అభివర్ణించారు.
కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. సెప్టెంబరు 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్‌చారి, పూజారి అమృతయ్య, తోట రామారావు, రాజయ్య, మల్లయ్య, శంకర్, రాంజీ, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది దగా పాలన

- హామీలు అమలు చేయకుండా యువతను మోసం చేసింది
- విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- 1000 రోజుల పాలనా వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట
- పరకాలలో భారీ ర్యాలీ.. అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా
- విద్యార్థులను అడ్డుకున్న పోలీసుల తీరుపై చల్లా ఆగ్రహం





**అక్షరశక్తి, పరకాల :** ఎన్నికల ముందు యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు రుణాలు, విద్యా భరోసా కార్డు వంటి హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో వైఫల్యాలు, హామీల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా నాలుగో రోజు పరకాల పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగింది. అనంతరం తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**విద్యార్థులను అడ్డుకోవడంపై ఆగ్రహం**

ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థులను అడ్డుకోవడంపై చల్లా ధర్మారెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొనే హక్కు విద్యార్థులకు ఉందని, ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని అన్నారు. విద్యార్థులను చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకంత భయం? ప్రశ్నించే గొంతులను అడ్డుకోవడం చేతగాని పాలనకు నిదర్శనం అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, విద్యార్థుల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

**హామీలు ఏమయ్యాయి.. రేవంత్‌రెడ్డి?**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ యువతకు ఇచ్చిన హామీలను చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. నిరుద్యోగులకు నెలకు *రూ.4 వేల భృతి* ఏమైంది?, తొలి ఏడాదిలో *2 లక్షల ఉద్యోగాలు* ఎక్కడ?, ప్రకటించిన *జాబ్ క్యాలెండర్* ఏమైంది?, యూత్ కమిషన్ ఏర్పాటు ఎందుకు జరగలేదు?, విద్యార్థులకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు ఎక్కడ?, విద్యార్థినులకు ఇస్తామన్న ఎలక్ట్రిక్ స్కూటీలు ఏమయ్యాయి?, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ?, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి?, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఇస్తామన్న రూ.25 లక్షల ఆర్థిక సహాయం ఏమైంది? అంటూ ప్రభుత్వాన్ని చల్లా ధర్మారెడ్డి నిలదీశారు.

**జీఓ 97ను రద్దు చేయాలి**

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. "యువత భవిష్యత్తుతో ఆడుకుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ హయాంలో విద్యకు పెద్దపీట

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టామని చల్లా ధర్మారెడ్డి పేర్కొన్నారు. గురుకులాలు, జూనియర్ కళాశాలలు, ప్రత్యేక మైనార్టీ గురుకులాలను విస్తృతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. 294 నుంచి 1,000కు పైగా గురుకులాలు ఏర్పాటు చేశామని, 'మన ఊరు–మన బడి', 'మన బస్తీ–మన బడి' కార్యక్రమాల ద్వారా సుమారు రూ.7,900 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేశామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, యూనివర్సిటీల బలోపేతం వంటి చర్యలు తీసుకున్నామని వివరించారు. మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు.

# మహిళల భద్రతే ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రధాన లక్ష్యం



**అక్షరశక్తి,వరంగల్:** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య అన్నారు. వరంగల్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో సుమారు 250 మంది విద్యార్థినులకు షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), భరోసా కేంద్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని ఏసీపీ సదయ్య సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ , టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, మహిళలు ఒంటరిగా తెలియని ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో టీసేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. నివాస ప్రాంతాల్లో ఆకతాయిలు, అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే ధైర్యంగా వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీపీ తెలిపారు. షీ టీమ్స్‌కు సంబంధించి సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నంబర్ 8712685270కు సమాచారం అందించవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ఏహెచ్‌టీయూ సీఐ రమేష్, షీ టీమ్ ఎస్ఐ స్వాతి, సిబ్బంది, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల భూములను లాక్కునే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు



**అక్షరశక్తి,హైదరాబాద్:** ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో 'భూభారతి' రెవెన్యూ పోర్టల్ లోపాలు, సెక్షన్ 22ఏ పేరుతో రైతులు, పేదల భూములను నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ చేపట్టిన మహాధర్నాలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సాగు చేసుకుంటున్న, రిజిస్ట్రేషన్లు కలిగిన భూములను సైతం 22ఏ జాబితాలో చేర్చి రైతులను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. ఈ విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు భూములపై హక్కులు కోల్పోయి, అప్పులు పొందలేక, భూములు విక్రయించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 'భూభారతి' పేరుతో జరుగుతున్న భూ అక్రమాలపై అసెంబ్లీ హౌస్ కమిటీ ఏర్పాటు చేసి, భూ బాధితులకు న్యాయం చేయాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరిని వీడి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర బీజేపీ నాయకత్వం పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. రైతులకు, భూ బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ క్షేత్రస్థాయిలో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



# ఉత్తమ ఉపాధ్యాయుడు అర్షం స్వామి

**అక్షరశక్తి, హనుమకొండ:** మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధా కృష్ణన్ జయతి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ సుబేదారి లోని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సన్మానం చేశారు. ఈసందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి గా ఎంపికైన శాయంపేట మండలం తహారాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అర్షం స్వామినీ కలెక్టర్ సన్మానం చేసి ప్రశంస పత్రం అందజేశారు.ఈబి కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గిరిరాజ్, విద్యా అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పెద్ది విగ్రహ గద్దె కూల్చివేతపై

# ఎర్రబెల్లి ఆగ్రహం

**విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం దుర్మార్గం**





**అక్షరశక్తి, నర్సంపేట :** అశోక్‌నగర్‌లో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఖానాపూర్ మండలం అశోక్‌నగర్‌లో గద్దె కూల్చివేసిన ప్రాంతాన్ని ఆయన సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం వెనుక కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉందని ఎర్రబెల్లి ఆరోపించారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విగ్రహం కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడం దారుణమన్నారు. నర్సంపేట పట్టణంలో ఎన్నో విగ్రహాలు అనుమతులతో ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. రామప్ప-పాకాల చెరువు ప్రాజెక్టును తీసుకువచ్చి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను గుర్తిస్తూ అభిమానులు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తే అడ్డుకోవడం సరికాదన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి తీరుతామని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలకు పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతామని కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇలాంటి చర్యలతో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫ్రిజ్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- **రూ.50 వేల నగదు, ధ్రువపత్రాలు బూడిద**
- **కూలి పనికి వెళ్లిన కుటుంబం.. సర్వం అగ్నికి ఆహుతి**



**అక్షరశక్తి, స్టేషన్‌ఘన్‌పూర్ :** ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన రాఘవాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.50 వేల నగదుతో పాటు చిన్నారుల విద్యా ధ్రువపత్రాలు, దుస్తులు, గృహోపకరణాలు కాలిపోయాయి. రాఘవాపూర్ గ్రామానికి చెందిన బెజ్జం రాజు ప్రస్తుతం కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నారు. అప్పటి వరకు పక్కనే ఉన్న చిన్న రేకుల ఇంట్లో కుటుంబంతో కలిసి తాత్కాలికంగా నివసిస్తున్నారు. రోజువారీ కూలి పనులకు కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంట్లోని ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లో ఉన్న నగదు, విద్యా ధ్రువపత్రాలు, దుస్తులు, ఇతర సామగ్రి మంటల్లో కాలిపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కొత్త ఇల్లు నిర్మించుకుంటున్న కుటుంబానికి తాత్కాలిక నివాసం కూడా కాలిపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రభుత్వం, దాతలు స్పందించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి టీచర్ ఉత్తములే

- **విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **జిల్లా కలెక్టరేట్లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు**
- **జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**





**అక్షరశక్తి, హన్మకొండ :** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు ఉత్తములేనని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జ కలెక్టర్ పూలమాల వేసి..జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాన్నే కాకుండా సమాజాన్ని, భవిష్యత్ తరాన్ని ఉత్తమ మార్గం వైపు మార్చగలరని, నడిపిస్తారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని సమాజాన్ని నిలబెట్టే బాధ్యత కలిగి ఉంటుందన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమైందన్నారు ఉపాధ్యాయుల కృషితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలే కాకుండా మానవత్వపు విలువలను ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుని ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటూ ఉండడంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయని అన్నారు. జిల్లాలో పాఠశాల విద్యాశాఖలో ప్రాథమిక పాఠశాలలు 299, ప్రాథమికోన్నత పాఠశాలలు 146, ఉన్నత పాఠశాలలు 396 ఉన్నాయని... జిల్లాలో మొత్తం 841 పాఠశాలల్లో 1,56,995 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను గురించి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ నివేదించారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, సునీత, సుమా, పలువురు ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల్లో విస్మరణ ఎందుకు?

- **ఎస్‌జీటీలు, వ్యాయామ ఉపాధ్యాయులకు అన్యాయం**
- **గిరిజన సంక్షేమ శాఖ తీరుపై ఏటీఏ జిల్లా అధ్యక్షుడు పెనుక ప్రభాకర్ ప్రశ్న**



**అక్షరశక్తి, గూడూరు :** గిరిజన సంక్షేమ శాఖలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల విషయంలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులను విస్మరించడం సరికాదని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పెనుక ప్రభాకర్ అన్నారు. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదని, విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి, మంచి విలువలు నేర్పే గురువు, భవిష్యత్తును నిర్మించే శిల్పి అని పెనుక ప్రభాకర్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గత విద్యా సంవత్సరంలో 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అయితే గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో అంకితభావంతో పనిచేస్తున్న ఎస్‌జీటీలు, వ్యాయామ ఉపాధ్యాయులను ఎందుకు విస్మరిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. పంచాయతీరాజ్ విద్యాశాఖలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎస్‌జీటీలు, వ్యాయామ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ అవార్డులు ఇస్తున్నప్పుడు గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల విషయంలో వివక్ష చూపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఐటీడీఏ ఉట్నూరు, భద్రాచలంలో పనిచేసే ఎస్‌జీటీలు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తున్నారని, మరి ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులు చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. ఇటీవల స్పోర్ట్‌స్‌డేకు కొత్తగూడకు వచ్చిన ఐటీడీఏ పీవోకు అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వాలని ఏటీఏ తరఫున వినతిపత్రం అందించామని, పీవో సానుకూలంగా స్పందించారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడం ఆందోళనకరమన్నారు. దీనిపై త్వరలో మంత్రి, కలెక్టర్, ఐటీడీఏ పీవోను సంఘం ఆధ్వర్యంలో కలిసి సమస్యలను వివరిస్తామని పెనుక ప్రభాకర్ తెలిపారు.

# గురువుల సేవలు మరువలేనివి



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. తెలుగు శాఖ అధ్యక్షుడు లింగయ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు విశిష్ట స్థానం ఉందన్నారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఉన్నత విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గురువు చూపే మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు డా. చిర్ర రాజు మాట్లాడుతూ గురు-శిష్య సంబంధం భారతీయ విద్యా సంప్రదాయంలో ఎంతో ప్రాచీనమైనదని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థులు గురువుల బోధనలు, సూచనలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. తెలుగు విభాగ అధ్యాపకులు డా. కే. సదాశివ్, టి. అన్నపూర్ణ, డా. బానోత్ స్వామి గురుపూజోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ప్రతి విద్యార్థిలో గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం ఉండాలని పేర్కొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

- జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడొద్దు
- మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్




**అక్షరశక్తి, హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన సందర్భంగా రాష్ట్రంలో విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఓరుగల్లు గడ్డపై భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున కదిలి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. హనుమకొండలోని ఏకశిలా పార్కు (ప్రొఫెసర్ జయశంకర్ సర్ స్మృతి వనం) వద్ద నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి, జీవో 97ను రద్దు చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన-ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచి వారి విద్యకు ఆటంకం కలిగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**జీవో 97ను వెంటనే రద్దు చేయాలి**

పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధించిన సమస్యలపై కూడా దాస్యం వినయ్ భాస్కర్ గారు తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవో కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని, విద్యార్థులు, విద్యావేత్తలు మరియు సంబంధిత వర్గాలతో చర్చించి వారి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పాలిటెక్నిక్ విద్య అనేది సాంకేతిక విద్యలో కీలకమైన భాగమని, వేలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఈ విద్యపై ఆధారపడుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే విధంగా ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్ఎస్ విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు.

**వేలాది మంది విద్యార్థులతో కదిలిన ఓరుగల్లు**

ఈ భారీ ర్యాలీకి విద్యార్థులు, యువత నుంచి విశేష స్పందన లభించింది. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి", "జీవో 97ను రద్దు చేయాలి", "విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి" అంటూ నినాదాలతో హనుమకొండ మార్మోగింది. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని దాస్యం వినయ్ భాస్కర్ గారు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు, విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, యువత హక్కుల కోసం ఓరుగల్లు గడ్డపై ప్రారంభమైన ఈ పోరుబాటను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లోని డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

# ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ సృజన కు ఘన సన్మానం



**అక్షరశక్తి, వరంగల్ :** ఉత్తమ ఉపాధ్యాయురాలుగా (ఫిజికల్ డైరెక్టర్) ఎంపికైన అంకేశ్వరపు సృజనను మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య, గెజిటెడ్ హెడ్మాస్టర్లు జి. ప్రభాకర్, పూసారం, ఇందిర, శ్రీనివాస్, రఫిక్ అహ్మద్, ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు తాళ్లపెల్లి ప్రకాష్‌గౌడ్ లు ఘనంగా సత్కరించారు. ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేటలో శ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవం శనివారం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ లో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఏ సృజన ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు జి. ప్రభాకర్, పూసారామ్, ఇందిర, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి మాట్లాడుతూ..సాఫ్ట్ బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణిగా పలు పతకాలు పొంది.. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా నియమితురాలైనప్పటి నుంచి పలు పాఠశాలల విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇచ్చిన సృజన ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికవడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ బడిని.. సాఫ్ట్ బాల్ అడ్డాగా మార్చినందుకు పాఠశాల తరఫున అభినందనలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం సృజన మాట్లాడుతూ.. తనకు అవార్డు రావడం ఆనందంగా ఉందని..అయితే ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని.. రానున్న రోజుల్లో మరింత మంది క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేస్తానని.. తనకు సహకరించిన ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులకు, నాతోటి ఉపాధ్యాయులకు, ప్రత్యేకంగా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కొండా యాదగిరి, సీఆర్పీలు రాధాకృష్ణ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో 'అచ్చ.. పచ్చ' పంచాయితీ!

- కుడా మాజీ చైర్మన్ ఇనుగాలకు వీడ్కోలు లేకుండానే పదవీ మార్పు
- హడావుడిగా కొత్త చైర్‌పర్సన్ గుండు సుధారాణి ప్రమాణ స్వీకారం
- కార్యక్రమానికి మాజీ చైర్మన్ దూరం.. పార్టీ వర్గాల్లో మొదలైన కొత్త చర్చ
- కొత్తగా వచ్చిన నేతలకే ప్రాధాన్యమంటూ పాత కాంగ్రెస్ నేతల అసంతృప్తి





**అక్షరశక్తి, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయ విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' పేరుతో కొంతకాలంగా సాగుతున్న రాజకీయ చర్చకు కుడా చైర్మన్ పదవిలో చోటుచేసుకున్న పరిణామాలు మరింత ఆజ్యం పోసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇనుగాల వెంకట్రాంరెడ్డి పదవీకాలం ముగిసిన వెంటనే గుండు సుధారాణిని కుడా చైర్‌పర్సన్‌గా నియమించడం, ఆ వెంటనే ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించడం చర్చకు దారితీసింది. మాజీ చైర్మన్‌కు వీడ్కోలు కార్యక్రమం లేకపోవడం, కొత్త చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారానికి వెంకట్రాంరెడ్డి హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. పదవుల మార్పు సహజమే అయినా.. దానికి సంబంధించిన పరిణామాలు మాత్రం కాంగ్రెస్‌లోని పాత, కొత్త నేతల మధ్య ఉన్న అంతరాన్ని బయటపెడుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పాత నేతల్లో అసంతృప్తి**

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని చాలాకాలంగా పనిచేస్తున్న నేతలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభించడం లేదన్న అసంతృప్తి క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులు, ఇతర కీలక అవకాశాల విషయంలో తమకు న్యాయం జరగడం లేదని కొందరు సీనియర్ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కీలక పదవులు దక్కుతున్నాయన్న ప్రచారం పాత క్యాడర్‌లో ఆవేదనకు కారణమవుతోంది. కుడా చైర్మన్ పదవి మార్పు కూడా ఈ చర్చకు మరో ఉదాహరణగా కొందరు నేతలు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం ఇన్నాళ్లు పనిచేసిన వారిని విస్మరించి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**'పచ్చ' నేతల చుట్టూ సమీకరణాలు?**

గతంలో టీడీపీలో పనిచేసిన కొందరు ముఖ్య నేతలు ఇప్పుడు కాంగ్రెస్‌లో ఒకే రాజకీయ వర్గంగా ప్రభావం చూపుతున్నారన్న చర్చ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తాజాగా ఊపందుకుంది. పార్టీ అధిష్ఠానంలోని కొందరు కీలక నేతల అండదండలు వారికి ఉన్నాయన్న ఆరోపణలు కూడా కాంగ్రెస్‌లోని మరో వర్గం నుంచి వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, పార్టీ బాధ్యతల కేటాయింపులోనూ ఈ వర్గానికే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. దీంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య రాజకీయ దూరం పెరుగుతోందన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం కుడా పరిణామాలు కూడా ఈ వర్గపోరుకు ప్రతిబింబంగా కొందరు నేతలు విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది.

**అధిష్ఠానం అండ ఎవరికి?**

పార్టీలో పాత, కొత్త నేతల మధ్య సాగుతున్న ఈ అంతర్గత చర్చకు అధిష్ఠానం ఎలా ముగింపు పలుకుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కొత్తగా చేరిన నేతలకు కీలక పదవులు వరుసగా దక్కడానికి కారణమేంటి? పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన నాయకులకు ఎందుకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు? పదవుల భర్తీలో సామాజిక, రాజకీయ సమీకరణాలకే ప్రాధాన్యమా? స్థానిక నాయకుల అభిప్రాయాలకు ఎంతమేర విలువ లభిస్తోంది? అనే ప్రశ్నలు పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. కుడా చైర్‌పర్సన్ నియామకంతో మొదలైన ఈ చర్చ రాబోయే రోజుల్లో మరింత ముదురుతుందా.. లేక అధిష్ఠానం జోక్యంతో సద్దుమణుగుతుందా అన్నది వేచి చూడాల్సిందే.

# ప్రపంచానికి దిక్సూచి ఉపాధ్యాయ వృత్తి

**అక్షరశక్తి, మహబూబాబాద్ :** ఈప్రపంచానికి ఉపాధ్యాయ వృత్తి దిక్సూచి అని మహబూబాబాద్ రోటరీక్లబ్ అధ్యక్షులు దూదికట్ల సత్యం అన్నారు. ఉపాధ్యాయ వృత్తిని పురస్కరించుకొని స్థానిక వికాస్ కళాశాలలో ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులు దూదికట్ల సత్యం, సెక్రెటరీ శంతన్ రామరాజు, డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్ రెడ్డీ, ట్రెజరర్ ముల్లంగి మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన గావించారు. ఈసందర్భంగా దూదికట్ల సత్యం మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని వ్యవస్థలనూ తయారుచేసే ఉపాధ్యాయ వృత్తి అత్యుత్తమమైందని అన్నారు. భావిభారతాన్ని తరగతిగదిలో నిర్మించే ఉపాధ్యాయులకు ప్రపంచం ఎప్పుడూ ఋణపడే ఉంటుందని అన్నారు. దురదృష్టవశాత్తు రానురానూ ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అంతరం పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచానికి సూర్యుడు వెలుగునిస్తే ఉపాధ్యాయులు జ్ఞానంతో జీవితాన్ని అందిస్తాడని అన్నాడు. అనంతరం ముప్పై మంది ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులకు శాలువా బొకేతో మెమెంటో అందజేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇంకా ఈకార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వజర్ తోర్నాల నగేష్ కుమార్, పాస్ట్ ప్రెసిడెంట్లు వేమిశెట్టి కిషోర్ కుమార్, గూడూరు నాగేశ్వర రావు, బొల్లం శ్రీనివాస్, బోనగిరి గిరిదర్ గుప్తా, నాళ్ళ లక్ష్మి నర్సింహారావు, సాధు మహిపాల్ రెడ్డి, జంగాల నర్సింహారావు బోయినిపల్లి సతీష్ రావు, జంగాల విజయ్ కుమార్, వల్లాల రమేష్, అచ్చ శ్రీనివాస్, కట్ల వెంకన్నతో పాటు సన్మాన గ్రహీతలు వున్నారు.



GUEST COLUMN

# మీడియా మూలాలు మరిచినప్పుడు ప్రజాస్వామ్యం ఏం కోల్పోతుంది?

> ఒకప్పుడు వార్తా మాధ్యమం అంటే ప్రజలకు సమాచారం అందించే సంస్థ మాత్రమే కాదు. అధికారాన్ని ప్రశ్నించే వ్యవస్థ. ప్రజల గొంతుకను ప్రభుత్వానికి వినిపించే వారధి. అధికార దుర్వినియోగాన్ని వెలుగులోకి తెచ్చే కాపలాదారు. అందుకే పత్రికా రంగాన్ని ప్రజాస్వామ్యానికి "నాలుగో స్తంభం"గా పిలిచారు. కానీ గత దశాబ్ద కాలంలో భారతీయ మీడియా ఎదుర్కొంటున్న పరిణామాలను పరిశీలిస్తే, సమస్య కేవలం కొన్ని టెలివిజన్ చానళ్ల రేటింగులు పడిపోవడం, పత్రికల సర్క్యులేషన్ తగ్గడం లేదా జిల్లా స్థాయిలో రిపోర్టర్ల సంఖ్య క్షీణించడం కాదు. మీడియా తన సామాజిక పాత్ర, సంపాదకీయ స్వతంత్రత, విశ్వసనీయతను క్రమంగా కోల్పోతున్నదా అన్నదే అసలు ప్రశ్న.


సాంకేతిక పరిణామం ఈ మార్పుకు ప్రధాన కారణాల్లో ఒకటి. స్మార్ట్‌ఫోన్, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, పాడ్‌కాస్ట్‌లు, కృత్రిమ మేధస్సు ఆధారిత సమాచార వేదికలు వార్తల వినియోగ పద్ధతినే మార్చేశాయి. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2026 డిజిటల్ న్యూస్ రిపోర్ట్ ప్రకారం భారతదేశంలో మెజారిటీ ప్రజలు ఆన్‌లైన్‌లో వార్తలను పొందుతున్నారు; యూట్యూబ్ ద్వారా వార్తలు పొందుతున్న వారి వాటా సుమారు 58 శాతం. టెలివిజన్ ఇప్పటికీ 44 శాతం మందికి వార్తల వనరుగా ఉన్నప్పటికీ, దాని పాత ఆధిపత్యం స్పష్టంగా తగ్గింది. అదే సమయంలో ఏఐ యాంకర్లు, ఏఐ క్లోన్లు, చిన్న వీడియోలు, వ్యక్తిగత కంటెంట్ క్రియేటర్లు వార్తా ప్రపంచంలోకి వేగంగా ప్రవేశిస్తున్నారు.

దీంతో వార్తా సంస్థలకు జర్నలిజం కంటే "కంటెంట్" ముఖ్యమవుతున్న ప్రమాదం పెరిగింది. వేగం, సంచలనం, క్లిక్, వైరల్ వీడియో, రేటింగ్, ప్రకటన ఆదాయం—ఇవే విజయానికి ప్రమాణాలుగా మారుతున్నాయి. ఒక వార్త నిజమా కాదా అన్నదానికంటే అది ఎంతమందిని ఆకర్షిస్తుంది అన్నది ముఖ్యమవుతోంది. ఫలితంగా వాస్తవాలను సేకరించడం, బహుళ మూలాలను పరిశీలించడం, ప్రత్యక్షంగా క్షేత్రస్థాయికి వెళ్లడం వంటి ఖరీదైన జర్నలిజం క్రమంగా వెనక్కి నెట్టబడుతోంది.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

ఇది కేవలం సాంకేతిక సమస్య కాదు. మీడియా వ్యాపార నమూనాలో వచ్చిన మార్పు కూడా అంతే కీలకం. ప్రకటనల ఆదాయం సంప్రదాయ పత్రికలు, టెలివిజన్ నుంచి డిజిటల్ వేదికలకు మళ్లింది. కోవిడ్ తరువాత అనేక సంస్థల్లో ఉద్యోగ కోతలు జరిగాయి. ఉద్యోగ భద్రత తగ్గినప్పుడు జర్నలిస్టు యాజమాన్య ఒత్తిడిని ఎంతవరకు ఎదుర్కోగలడు? రాజకీయ ఒత్తిడికి ఎంతకాలం నిలబడగలడు? అనే ప్రశ్న సహజంగానే వస్తుంది. స్వతంత్ర జర్నలిజానికి అవసరమైన వనరులు తగ్గిపోతే, చివరికి తగ్గేది వార్తల




నాణ్యతే.

అయితే భారతీయ మీడియా సంక్షోభాన్ని కేవలం టెక్నాలజీతో వివరించడం అసంపూర్ణం. మీడియా యాజమాన్యం కొద్దిమంది ఆర్థిక శక్తివంతుల చేతుల్లో కేంద్రీకృతం కావడం మరింత తీవ్రమైన సమస్య. ఒక వ్యాపార సామ్రాజ్యం వార్తా పత్రికలు, టెలివిజన్, డిజిటల్ వేదికలు, వార్తా సంస్థలు వంటి అనేక సమాచార మార్గాలపై ప్రభావం చూపగలిగితే, ఆర్థిక ప్రయోజనాలు సంపాదకీయ స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

ఎన్‌డీటీవీ ఉదాహరణ ఈ చర్చకు ప్రాధాన్యం కలిగించింది. అదానీ గ్రూప్‌కు చెందిన ఏఎంజీ మీడియా నెట్‌వర్క్ ఎన్‌డీటీవీని స్వాధీనం చేసుకున్న తరువాత భారతీయ మీడియా యాజమాన్య కేంద్రీకరణపై చర్చ మరింత పెరిగింది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2023 నివేదిక కూడా దీనిని భారత మీడియా రంగంలో పెద్ద వ్యాపార సమూహాల పెరుగుతున్న ప్రభావానికి ఉదాహరణగా పేర్కొంది.

ఇక్కడ అసలు ప్రశ్న యజమాని ఎవరు అన్నది కాదు. యజమాని వ్యాపార ప్రయోజనాలు, రాజకీయ సంబంధాలు, సంపాదకీయ విధానం మధ్య గీత ఎంత స్పష్టంగా ఉంది అన్నదే. ఒక మీడియా సంస్థ తన యజమాని వ్యాపార ప్రయోజనాలకు అనుకూలంగా వార్తలను ఎంచుకుంటే, అది జర్నలిజం కాదు. అదే విధంగా ప్రభుత్వం ఏది అధికారంలో ఉన్నా దానికి అనుకూలంగా మాత్రమే వార్తలను అందించడం కూడా జర్నలిజం కాదు.

రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2025 భారత నివేదిక మీడియా యాజమాన్యం కొద్దిమంది సంపన్న వ్యాపారవేత్తల వద్ద కేంద్రీకృతమైందని, స్వతంత్ర మీడియా సంస్థలు, ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులు వేధింపులు లేదా చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అయితే ఇదే సమయంలో ది వైర్, స్క్రోల్, న్యూస్‌లాండ్రీ, ది కారవాన్, ది న్యూస్ మినిట్ వంటి స్వతంత్ర డిజిటల్ వేదికలు ప్రత్యామ్నాయ కథనాలను అందిస్తున్నాయని కూడా గుర్తించింది.

రాజకీయ ప్రభావం ప్రశ్న ఇక్కడ మరింత సున్నితమైనది. 2014 తరువాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శకులు చేసిన ప్రధాన ఆరోపణ ఏమిటంటే—దర్యాప్తు సంస్థలు, పన్ను వ్యవస్థ, భద్రతా చట్టాలు, డిజిటల్ నియంత్రణ వ్యవస్థలను ఉపయోగించి ప్రభుత్వాన్ని విమర్శించే స్వరాలపై ఒత్తిడి పెరిగిందని. ప్రభుత్వం మాత్రం ప్రతి చర్యనూ చట్టబద్ధమైన దర్యాప్తు, జాతీయ భద్రత, విదేశీ నిధుల నియంత్రణ లేదా తప్పుడు సమాచారాన్ని అరికట్టే చర్యగా సమర్థిస్తోంది.

ప్రతి దర్యాప్తునూ మీడియా అణచివేతగా పరిగణించడం న్యాయసమ్మతం కాదు. ఒక మీడియా సంస్థపై ఆర్థిక అవకతవకలు, విదేశీ నిధులు లేదా ఇతర నేరాలకు సంబంధించి ఆధారాలు ఉంటే చట్టం తన పని చేయాలి. కానీ అదే సమయంలో ఒక కీలక ప్రజాస్వామ్య

ప్రశ్నను కూడా విస్మరించలేం. ప్రభుత్వాన్ని విమర్శించే సంస్థలపైనే ఇలాంటి చర్యలు పదేపదే జరుగుతున్నాయా? చట్టం అందరికీ సమానంగా వర్తిస్తున్నదా? దర్యాప్తు ప్రక్రియ పారదర్శకంగా ఉందా? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం.

బీబీసీ కార్యాలయాల్లో 2023లో జరిగిన ఆదాయపు పన్ను సర్వేలు ఇందుకు ముఖ్యమైన ఉదాహరణ. భారత ప్రభుత్వం ఆ చర్యలను పన్ను నిబంధనలకు సంబంధించిన ప్రక్రియగా సమర్థించింది. అయితే బీబీసీ ప్రసారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శనాత్మక డాక్యుమెంటరీపై కేంద్రం తీవ్రంగా స్పందించిన కొద్దికాలానికే ఈ సర్వేలు జరగడం అనుమానాలకు కారణమైంది. ఫ్రీడమ్ హౌస్ కూడా డాక్యుమెంటరీపై ఆంక్షలు, బీబీసీ కార్యాలయాల సర్వేలు, న్యూస్‌క్లిక్ కార్యాలయాలపై దాడులను భారత మీడియా స్వేచ్ఛపై పెరుగుతున్న ఒత్తిడికి ఉదాహరణలుగా నమోదు చేసింది.

న్యూస్‌క్లిక్ వ్యవహారం మరింత తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. విదేశీ నిధులు, చైనా అనుకూల ప్రచారం వంటి ఆరోపణలపై న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, జర్నలిస్టుల ఇళ్లపై దాడులు జరిగాయి. ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను యూఏపీఏ కింద అరెస్టు చేశారు. అయితే 2024 మేలో సుప్రీంకోర్టు ఆయన అరెస్టును చట్టపరమైన విధానాలను పాటించలేదన్న కారణంతో చెల్లదని ప్రకటించి విడుదలకు ఆదేశించింది. అరెస్టు కారణాలను రాతపూర్వకంగా తెలియజేయడం రాజ్యాంగపరమైన హక్కు అని కోర్టు స్పష్టం చేసింది.

ఇలాంటి సంఘటనల్లో ముఖ్యమైన అంశం కేవలం ఒక జర్నలిస్టు జైలుకు వెళ్లాడా లేదా అన్నది కాదు. ఒక జర్నలిస్టు అరెస్టయినప్పుడు మిగిలిన వందలాది మంది జర్నలిస్టులలో ఏర్పడే భయం కూడా ప్రజాస్వామ్యానికి సంబంధించిన సమస్యే. “ఈ విషయం రాస్తే ఏమవుతుంది?”, “ఈ కథనం వల్ల కేసు వస్తుందా?”, “యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగిస్తుందా?” అనే ప్రశ్నలు వార్తా గదిలోకి ప్రవేశించినప్పుడు స్వీయ నియంత్రణ మొదలవుతుంది. చట్టపరమైన సెన్సార్ కంటే స్వీయ సెన్సార్ మరింత ప్రమాదకరమైనది.

కాశ్మీర్‌లో పరిస్థితి ఈ సమస్యను మరో కోణంలో చూపిస్తోంది. జర్నలిస్టులపై కేసులు, అరెస్టులు, పోలీసు విచారణలు, ఇంటర్నెట్ పరిమితులు, ప్రయాణ ఆంక్షలపై అంతర్జాతీయ సంస్థలు ఎన్నోసార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆసిఫ్ సుల్తాన్ వంటి జర్నలిస్టులు ఉగ్రవాద నిరోధక చట్టాల కింద దీర్ఘకాలం నిర్బంధించబడ్డారు. 2026లో కూడా జర్నలిస్టు ఇర్ఫాన్ మెహ్రాజ్ దీర్ఘకాలిక ముందస్తు నిర్బంధంలో ఉన్నారని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ పేర్కొంది.

2025లో పహల్గామ్ దాడి తరువాత భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో కాశ్మీర్‌లో జర్నలిస్టులపై మరింత ఒత్తిడి పెరిగిందని కూడా అదే సంస్థ పేర్కొంది. సున్నితమైన అంశాలపై రాస్తున్న జర్నలిస్టులు నిఘా, అరెస్టులు, ప్రతీకార చర్యల భయంతో పనిచేస్తున్నారని దాని నివేదిక తెలిపింది.

పెగాసస్ నిఘా ఆరోపణలు కూడా ఇదే నేపథ్యంలో చూడాల్సిన అంశం. జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు సహా పలువురి ఫోన్లు పెగాసస్ స్పైవేర్ ద్వారా లక్ష్యంగా పెట్టబడ్డాయన్న అంతర్జాతీయ పరిశోధనలు దేశంలో డిజిటల్ నిఘా సామర్థ్యాలపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయి. ఇక్కడ కూడా అసలు ప్రశ్న ఎవరి ఫోన్ లక్ష్యంగా పెట్టబడిందన్నదానికంటే, ఒక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం పౌరులపై నిఘా పెట్టే అధికారానికి ఉన్న పరిమితులు ఏమిటన్నదే.

డిజిటల్ నియంత్రణ కూడా మరో సవాలు. సమాచార సాంకేతిక నియమాలు, డిజిటల్ మీడియా నిబంధనలు, టెలికమ్యూనికేషన్స్ చట్టం, వ్యక్తిగత డేటా రక్షణ వ్యవస్థ వంటి చర్యలు తప్పుడు సమాచారాన్ని అరికట్టడానికి అవసరమే. కానీ “తప్పుడు సమాచారం” పేరుతో నిజమైన విమర్శలను కూడా తొలగించే అవకాశం ఉంటే అది ప్రమాదకరం. 2026లో కృత్రిమ మేధస్సుతో రూపొందించిన కంటెంట్‌ను గుర్తించడం, తొలగింపు ప్రక్రియలను వేగవంతం చేయడం వంటి కొత్త నిబంధనలపై కూడా భావప్రకటన స్వేచ్ఛ, కార్యనిర్వాహక అధికారాల దుర్వినియోగంపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

ఇక సోషల్ మీడియా ఈ సంక్షోభాన్ని మరింత సంక్లిష్టం చేసింది. గతంలో వార్తను ఎడిటర్ పరిశీలించి ప్రచురించేవాడు. ఇప్పుడు ప్రతి పౌరుడూ వార్తా పంపిణీదారుడే. కానీ సమాచారం పంపే స్వేచ్ఛ పెరిగినంతగా బాధ్యత పెరగలేదు. తప్పుడు వార్తలు, పాత వీడియోలను కొత్త సంఘటనలుగా చూపించడం, కృత్రిమ మేధస్సుతో తయారైన నకిలీ చిత్రాలు, డీప్‌ఫేక్ వీడియోలు, రాజకీయ ట్రోలింగ్—ఇవన్నీ ప్రజల సమాచార ప్రపంచాన్ని కలుషితం చేస్తున్నాయి.

ఇక్కడ మీడియా సంస్థలకు ఒక కొత్త బాధ్యత ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన సమాచారాన్ని పునరావృతం చేయడం జర్నలిజం కాదు. వైరల్ సమాచారాన్ని ధృవీకరించి, వాస్తవం ఏమిటో చెప్పడమే జర్నలిజం. కానీ అనేక సందర్భాల్లో సంప్రదాయ మీడియానే సోషల్ మీడియా ట్రెండ్‌లను వార్తలుగా మార్చడం కనిపిస్తోంది. ఫలితంగా సోషల్ మీడియా, వార్తా మీడియా మధ్య ఉన్న సరిహద్దు క్రమంగా చెదిరిపోతోంది.

దీని తుది ఫలితం ప్రజల విశ్వాసంపై పడుతోంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2026 నివేదిక ప్రకారం భారతదేశంలో కేవలం 39 శాతం మంది మాత్రమే సాధారణంగా ఎక్కువ సమయం వార్తలను విశ్వసిస్తున్నామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఇది నాలుగు శాతం పాయింట్ల తగ్గుదల; 11 ఏళ్లలో నమోదైన కనిష్ఠ స్థాయి. అదే సమయంలో 58 శాతం మంది ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం, నకిలీ వార్తల గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే భారతదేశంలోని ఈ సర్వే ప్రధానంగా ఆంగ్లం మాట్లాడే ఆన్‌లైన్ వార్తా వినియోగదారులపై ఆధారపడిందనే పరిమితిని గుర్తుంచుకోవాలి.

ఇది కేవలం మీడియా సంస్థలకు హెచ్చరిక కాదు; ప్రజాస్వామ్యానికి హెచ్చరిక. ప్రజలు వార్తలను నమ్మకపోతే, వాస్తవాలను కూడా అనుమానించడం మొదలవుతుంది. ఒక చానల్ ఒక పార్టీకి, మరో చానల్ మరో పార్టీకి ప్రచార వేదికగా మారితే ప్రజలకు వార్త కాదు—పక్షపాతపు రాజకీయ వివరణ మాత్రమే మిగులుతుంది. “గోదీ మీడియా” అనే పదం ప్రజల్లో విస్తరించడం కూడా ఈ విశ్వాస సంక్షోభానికి ఒక సూచన. అయితే మీడియాపై ప్రజల అసంతృప్తి ఉన్నప్పటికీ జర్నలిస్టులపై భౌతిక దాడులు సమర్థనీయం కావు. 2026లో నిరసనల సందర్భంగా ప్రధాన స్రవంతి మీడియాపై కోపంతో జర్నలిస్టుపై దాడి జరిగిన సంఘటన దీనికి మరో ఉదాహరణ. మీడియాపై విమర్శ అవసరం; జర్నలిస్టులపై హింస కాదు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. భారతీయ మీడియా సంక్షోభానికి ఒకే రాజకీయ పార్టీని పూర్తిగా బాధ్యురాలిగా చూపడం సమస్యను సులభీకరించడం అవుతుంది. బీజేపీ–ఆరెస్సెస్ ప్రభావంపై విమర్శలు ఉన్నట్లే, గతంలో కాంగ్రెస్ లేదా ఇతర రాష్ట్ర ప్రభుత్వాల కాలంలో మీడియా–రాజకీయ–వ్యాపార సంబంధాలపై కూడా విమర్శలు వచ్చాయి. అసలు సమస్య వ్యక్తులు లేదా పార్టీలు మాత్రమే కాదు. రాజకీయ అధికారం, పెద్ద వ్యాపార ప్రయోజనాలు, మీడియా యాజమాన్యం పరస్పరం ఆధారపడే నిర్మాణం బలపడటమే.

అందుకే మీడియా స్వేచ్ఛ అంటే ప్రభుత్వాన్ని మాత్రమే విమర్శించే హక్కు కాదు. ప్రతిపక్షాన్ని కూడా ప్రశ్నించే స్వేచ్ఛ. యజమానిని కూడా ప్రశ్నించే ధైర్యం. ప్రకటనదారుడిని కూడా ప్రశ్నించే స్వాతంత్ర్యం. ప్రజాదరణ లేని వాస్తవాన్ని కూడా ప్రచురించే సంపాదకీయ నిబద్ధత. ప్రభుత్వం మంచి పని చేస్తే అభినందించడం ఎంత అవసరమో, తప్పు చేస్తే ప్రశ్నించడం అంతే అవసరం. అదే విధంగా ప్రతిపక్షం తప్పు చేసినా దానిని ప్రశ్నించాలి.

అయితే ఆశ పూర్తిగా చనిపోలేదు. చిన్న డిజిటల్ మీడియా సంస్థలు, స్థానిక జర్నలిస్టులు, పరిశోధనాత్మక పాత్రికేయులు, స్వతంత్ర న్యూస్ పోర్టల్లు ఇంకా ప్రజలకు ప్రత్యామ్నాయ సమాచారాన్ని అందిస్తున్నాయి. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ కూడా భారతదేశంలో స్వతంత్ర డిజిటల్ సంస్థలు ప్రధాన మీడియా కథనాలకు ప్రత్యామ్నాయాలను సృష్టిస్తున్నాయని గుర్తించింది.

కాబట్టి ఇప్పుడు మీడియా ముందు ఉన్న ప్రశ్న “ఎంత మంది చూస్తున్నారు?” అన్నది మాత్రమే కాదు. “ఎంత మంది నమ్ముతున్నారు?” అన్నదే. రేటింగ్ కోసం వార్తను సంచలనంగా మార్చడం తాత్కాలిక విజయాన్ని ఇవ్వవచ్చు. కానీ విశ్వసనీయత కోల్పోతే మీడియా తన అత్యంత విలువైన మూలధనాన్ని కోల్పోయినట్టే.

పత్రికా స్వేచ్ఛను కాపాడటం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత కాదు. మీడియా యాజమాన్య పారదర్శకత, సంపాదకీయ స్వాతంత్ర్యం, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, చట్టాల దుర్వినియోగానికి నిరోధక వ్యవస్థలు, బలమైన పబ్లిక్ బ్రాడ్‌కాస్టింగ్, స్వతంత్ర నియంత్రణ సంస్థలు, వాస్తవ నిర్ధారణ వ్యవస్థలు, మీడియా అక్షరాస్యత—ఇవన్నీ అవసరం. అదే సమయంలో మీడియా సంస్థలు కూడా తమపై తాము కఠినమైన నైతిక ప్రమాణాలను విధించుకోవాలి.

చివరికి పెద్ద చానళ్లు చిన్నవిగా మారుతున్నాయా అనేది మాత్రమే విషాదం కాదు. జర్నలిజం చిన్నదవుతున్నదా అనేదే అసలు విషాదం. జిల్లా రిపోర్టర్ తగ్గిపోవడం అంటే స్థానిక ప్రజల గొంతు తగ్గిపోవడం. పరిశోధనాత్మక జర్నలిజం తగ్గిపోవడం అంటే అధికారాన్ని ప్రశ్నించే సామర్థ్యం తగ్గిపోవడం. ఎడిటర్ స్వతంత్ర నిర్ణయం తీసుకోలేకపోవడం అంటే వార్తా గదిలో ప్రజాస్వామ్యం తగ్గిపోవడం. యజమాని రాజకీయ సంబంధాల కోసం సంపాదకీయ విధానాన్ని మార్చడం అంటే నాలుగో స్తంభం తన పునాదినే బలహీనపరచుకోవడం.

మీడియా తన మూలాలను మరిచిపోతే ప్రజలు దానిని ఎందుకు నమ్మాలి? చివరికి కోల్పోయేది చానల్ రేటింగ్ మాత్రమే కాదు. ఒక ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన ప్రజా విశ్వాసం, వాస్తవాలపై నమ్మకం, అధికారాన్ని ప్రశ్నించే సంస్కృతి కూడా. ఆ మూడు బలహీనపడితే ప్రజాస్వామ్య సంస్థలు కాగితంపై మిగిలినా, ప్రజాస్వామ్య ఆత్మ మాత్రం క్రమంగా క్షీణిస్తుంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.